నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

RNI - TELTEL/2023/87644

సంచిక : 213 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శుక్రవారం | 14-11-2025 పేజీలు -8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

నేటిబాలలంత మేటిపౌరులనుచు
చిన్నపిల్లలన్న మిన్నగాను
నెహ్రుగారు జూపె నేస్తపు భావము
గర్వమింతలేని ఘనుడుతాను

మీ
విజయప్రసాద్ నలుమాసు
కవి,తెలుగు బోధకులు


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.




# నేడు బీహార్ ఎన్నికల ఫలితాలు

- ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం
- ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు
- ఎగ్జిట్ పోల్ ఫలితాలు ఫలిస్తాయా
- మరోమారు నితీశ్ సిఎం అయ్యేనా

పాట్నా,నవంబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )

దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్న బిహార్ ఎన్నికల ఫలితాలు శుక్రవారం విడుదల కానున్నాయి. సీఎం నితీశ్ కుమార్ తన అధికారాన్ని నిలబెట్టుకుంటారా? లేదా? అనేది నేటితో తేలిపోతుంది. ఎగ్జిట్ పోల్ సర్వేల ప్రకారం మళ్లీ ఎన్‌డిఎ గెలుస్తుందని ప్రకటించారు. అయితే దీనిని తేజస్వియాదవ్ కొట్టి పారేశారు. సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా చేసి రికార్డు నెలకొల్పిన నితీశ్

-మిగతా 2 లో



# 32 కార్లతో భారీ కుట్ర

- 32 కార్లతో వరుస పేలుళ్ల కోసంరెడీ అయిన ముష్కరులు
- ఎర్రకోట ఘటన వెనక నిప్పలాంటి నిజాలు
- డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలన్న భారీ స్కెచ్
- దర్యాప్తులో వెల్లడవుతున్న కుట్ర కోణాలు

న్యూఢిల్లీ, -

దేశ రాజధాని ఢిల్లీ నగరంలోని ఎర్రకోట వద్ద జరిగిన కారు పేలుడు ఘటన దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ పేలుడు కేవలం ఒక చిన్న సంఘటన కాదని, దీని వెనుక దేశ వ్యాప్తంగా భారీ ఉగ్ర దాడులకు ప్రణాళిక వేసినట్లు భద్రతా ఏజెన్సీలు గుర్తించాయి. ఈ కుట్రలో వైట్‌కాలర్ ఉగ్రవాదులు పాల్గొన్నట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. భారీ ఉగ్రదాడి చేసేందుకు.. పేలుడు పదార్థాలు నింపిన 32 కార్లను సిద్ధం చేసేందుకు అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. డిసెంబర్ 6న దాడులకు పాల్పడాలని ఉగ్రవాదులు భావించారని విచారణలు తేలింది. అందుకోసమే ఈ 32 కార్లను కూడా సిద్ధం చేసుకున్నారని దర్యాప్తులో తేలింది.

-మిగతా 2 లో



# పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్

## ఇక్కడ పెట్టుబడులకు భద్రతకు ప్రభుత్వం హామీ

- వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ
- అధికారంలో ఎవరున్నా వన్నె తగ్గని హైదరాబాద్ బ్రాండ్
- అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటుకు హైదరాబాద్ అనుకూలం
- హైదరాబాద్‌లో రోడ్లకు ప్రముఖ కంపెనీల పేర్లు
- ఢిల్లీ అమెరికన్- ఇండియా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ,-నవంబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )

హైదరాబాద్ ప్రపంచవ్యాప్త పెట్టుబడిదారులకు ఉత్తమ గమ్యస్థానమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఎటువంటి ఢోకా లేకుండా భౌగోళికంగా కేంద్ర స్థానంలో హైదరాబాద్ ఉందన్నారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖ ద్వారమని సీఎం తెలిపారు. జీసీసీలకు గ్యమస్థానంగా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులకు ముందుకు రావాలని సీఎం పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. దేశంలోనే పెద్ద సంఖ్యలో యువత, వేగవంతమైన వృద్ధి రేటుతో ఉన్న రాష్ట్రం తెలంగాణ అని ముఖ్యమంత్రి అన్నారు.

-మిగతా 2 లో



# సుప్రీం ఆదేశాలను పాటించని స్పీకర్

- ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో పూర్తికాని విచారణ
- మరోమారు సుప్రీంలో కేసు వేసిన బిఆర్ఎస్
- సోమవారం విచారణ చేపడతామన్న సుప్రీం

న్యూఢిల్లీ, నవంబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్

తెలంగాణ రాజకీయాల్లో మరోమారు ఉత్కంఠత మొదలయ్యింది. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్ విచారణలో స్పీకర్ కోర్టు ధిక్కరణకు పాల్డ్డారని బిఆర్ఎస్ సుప్రీంలో కేసు దాఖలు చేసింది. అయితే అంతకు ముందే ఎమ్మెల్యేల ఫిరాయింపు విచారణపై స్పీకర్ సుప్రీంను గడువు కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ క్రమంలో పార్టీ మారిన ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుతో పాటు అన్నింటిపై సోమవారం విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు తెలిపింది. ఈ కేసు రాష్ట్ర రాజకీయ భవిష్యత్తును, శాసనసభ పటిష్టతను ప్రభావితం చేయనుంది అనడంలో సందేహం లేదు. గతంలో ఒక పార్టీ నుంచి గెలిచి, మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి తీర్పు

-మిగతా 2 లో



# భారత్‌తో యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం..

- రెండు వైపులా యుద్ధానికి పూర్తిగా సిద్ధం
- ఢిల్లీలో పేలుడు వేళ పాక్ మంత్రి సంచలన ప్రకటన

న్యూఢిల్లీ, -

పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ మరోసారి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. తమ దేశం రెండు దేశాలతో యుద్ధానికి సిద్ధంగా ఉందంటూ ప్రకటించారు. తూర్పు సరిహద్దులోని భారత్ , పశ్చిమ సరిహద్దులో తాలిబన్లతో .. రెండు వైపులా యుద్ధానికి పూర్తిగా సిద్ధంగా ఉన్నామంటూ ప్రకటించారు.ఓ బహిరంగ కార్యక్రమంలో మాట్లాడుతూ ఆయన ఈ విధంగా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 'మేము రెండు వైపులా యుద్ధానికి సిద్ధంగా ఉన్నాము. తూర్పు (భారతదేశం), పశ్చిమ సరిహద్దు (అఫ్ఘానిస్థాన్) దేశాలను రెండింటినీ ఎదుర్కోవడానికి మేము పూర్తి సన్నద్ధతతో ఉన్నాం. ఈ యుద్ధంలో అల్లా మాకు అన్ని విధాలుగా సాయం చేస్తాడు' అంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ పేలుడు ఘటన వేళ ఖవాజా వ్యాఖ్యలు ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. కాగా,పాక్‌లో రెండు రోజుల క్రితం ఆత్మాహుతి దాడి ఘటన చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఇస్లామాబాద్‌లోని ఓ కోర్టు ఆవరణలో కారులో బాంబు పేలింది. ఈ ఘటనలో 12 మంది మరణించగా..

-మిగతా 2 లో



# అమెరికాలో ముగిసిన షట్‌డౌన్..

- ఫండింగ్ బిల్లుపై ట్రంప్ సంతకం

న్యూఢిల్లీ,

అగ్రరాజ్యం అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ కు తెరపడింది. అమెరికా చరిత్రలోనే అత్యధిక కాలం కొనసాగిన ప్రభుత్వ షట్‌డౌన్‌కు ముగింపు పలికేందుకు ప్రభుత్వ ఫండింగ్ బిల్లు కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం రాత్రి సంతకం చేశారు. అంతకు ముందు రిపబ్లికన్ నేతృత్వంలోని ప్రతినిధుల సభలో 222-209 తేడాతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ఆ తర్వాత గంటల వ్యవధిలోనే బిల్లుపై అధ్యక్షుడు సంతకం చేశారు. దీంతో 43 రోజుల పాటూ సుదీర్ఘంగా సాగిన ప్రభుత్వ షట్‌డౌన్‌కు ముగింపు పడినట్లైంది. మూడు రోజుల క్రితమే ఈ బిల్లుకు అమెరికా సెనేట్ ఆమోదముద్ర వేసిన విషయం తెలిసిందే.సెనేట్‌లో రిపబ్లికన్లు ప్రవేశపెట్టిన ఫెడరల్ నిధులకు చెందిన బిల్లుకు ఆమోదం దక్కకపోవడంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ ప్రకటించింది. అమెరికా కాలమానం ప్రకారం సెప్టెంబర్ 30, అర్ధరాత్రి (11:59 నిమిషాలు) వరకు ఆ బిల్లు క్లియరెన్స్ కోసం

-మిగతా 2 లో

# నేడే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు

## 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి

- జూబ్లీహిల్స్ కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి
- కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో లెక్కింపు
- పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభం
- 42 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు ఆర్వో కర్ణన్ వెల్లడి

కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బంది

| జూబ్లీహిల్స్ బైపోల్–2025 | |
|---|---|
| మొత్తం ఓట్లు | 4,01,365 |
| పోలైన ఓట్లు | 1,94,621 |
| అభ్యర్థుల సంఖ్య | 58 |




2 లో



# ఆర్టీసీ ఆదాయ మార్గంలో పయనించేలా చేయండి

- కొత్త కాలనీలకు బస్ సౌకర్యాలు కల్పించాలి
- అధికారులతో సమీక్షలో మంత్రి పొన్నం ఆదేశం

హైదరాబాద్,నవంబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )

ఆర్టీసీ రెవెన్యూ పెంచేందుకు మార్గాలు అన్వేషించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్త కాలనీలకు బస్సు రూట్‌లు పెంచేలా అధ్యయనం చేయాలన్నారు. కారుణ్య నియామకాల కింద ఎంపికైన కండక్టర్ల ప్రొవిజన్ పీరియడ్ రెండేళ్లకు తగ్గించాలని చెప్పారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ డిపోలు లాభాల్లోకి వచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఆరంఘర్‌లో బస్సు టెర్మినల్ కోసం పోలీసు శాఖ భూములపై

-మిగతా 2 లో



# సీఐఐ సదస్సుకు విశాఖ ముస్తాబు

- 14,15 తేదీల్లో రెండ్రోజుల పాటు సదస్సు
- తైవాన్ కంపెనీలతో రెండు కీలక ఒప్పందాలు
- ఎక్స్ వేదికగా సీఎం చంద్రబాబు వెల్లడి

విశాఖపట్నం,- నవంబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )

విశాఖలో రెండురోజుల పాటు జరిగే సీఐఐ భాగస్వామ్య సదస్సు కోసం సముద్రతీర నగరం విశాఖపట్టణం అందంగా ముస్తాబయ్యింది. 14,15 తేదీల్లో సిఐఐ సదస్సు జరుగనుండగా... ఇందు కోసం ప్రభుత్వ యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ సదస్సును రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పటికే విశాఖకు చేరుకుని పలు కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరుపుతున్నారు.

-మిగతా 2 లో

## నేడు బీహార్ ఎన్నికల ఫలితాలు

(మొదటి తరువాయి)

కుమార్ ఈసారి గెలిస్తే సరికొత్త చరిత్ర సృష్టించిన వారవుతారు. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. ఓట్ల లెక్కింపు కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల సంఘం ఇటీవల తెలిపింది. కౌంటింగ్ సెంటర్లలో రెండంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశామని వెల్లడించింది. మొదటి భద్రతా వలయంలో కేంద్ర పారామిలిటరీ దళాలు, ఆ తరువాత రాష్ట్ర పోలీసు బలగాలతో పహారాను ఏర్పాటు చేసినట్టు తెలిపింది. 24/7 సీసీటీవీ నిఘా కూడా ఉంటుందని వెల్లడించింది. ఇక ఓట్లు భద్రపరిచిన ప్రతి స్ట్రాంగ్ రూమ్ క్యాంపస్ వద్ద జిల్లా సీనియర్ అధికారుల పర్యవేక్షణలో ఓ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా ఎలక్షన్ ఆఫీసర్లు, రిటర్నింగ్ ఆఫీసర్లు స్టాం÷-రగ్ రూమ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని ఈసీ ఆదేశించింది. ఈసారి ఎన్నికల్లో ఓటింగ్ భారీ స్థాయిలో నమోదైన విషయం తెలిసిందే. 243 అసెంబ్లీ నియోజకవర్గాలకు నవంబర్ 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఓటింగ్ నిర్వహించగా రికార్డు స్థాయిలో 67.13 శాతం మేర పోలింగ్ జరిగింది. దీంతో, ప్రజాతీర్పుపై ఉత్కంఠ పతాకస్థాయికి చేరుకుంది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే క్లీన్ స్వీప్ చేస్తుందని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ కూటమి నేత తేజస్వీ యాదవ్ మాత్రం ఈ అంచనాలను కొట్టిపారేశారు. తమ కూటమి మంచి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అన్నారు.సీఎం నితీశ్ సారథ్యంలోని జేడీ(యూ), బీజేపీతో సహా ఎన్డీయే (ఔఆం) కూటమిలోని ఐదు పార్టీలు బరిలో నిలిచాయి. జేడీ(యూ), బీజేపీలు 101 నియోజకవర్గాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దింపాయి. ఇక ఆర్‌జేడీ, కాంగ్రెస్, సీపీఐ(ఎమ్ఎల్) లిబరేషన్, ఇతర లెఫ్ట్ పార్టీలు, వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీలు మహాగఠ్‌బంధన్‌గా (మహాకూటమి) ఏర్పడి ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నాయి.

## సుప్రీం ఆదేశాలను పాటించని స్పీకర్

(మొదటి తరువాయి)

ఇస్తుందనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావన కూడా ఉండడం, ఈ విచారణకు మరింత ప్రాధాన్యతను తీసుకొచ్చింది. సోమవారం విచారణకు రానున్న ఈ కేసులో.. ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే దానిపై రాజకీయ వర్గాల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. ఈ తీర్పు.. భవిష్యత్తులో రాజకీయ నాయకులు పార్టీలు మారే విధానాన్ని, ఫిరాయింపులకు పాల్పడే ధోరణిని పూర్తిగా మార్చేసే అవకాశం ఉంది. కేసు ప్రాధాన్యత నేపథ్యంలో సుప్రీంకోర్టు ఇవ్వబోయే తుది తీర్పు.. ఫిరాయింపులను ప్రోత్సహించే పార్టీలకు, ఫిరాయింపులకు పాల్పడిన ఎమ్మెల్యేలకు ఒక కఠినమైన హెచ్చరికగా మారుతుందో లేదో వేచి చూడాలి.

### భారత్‌తో యుద్ధానికి పూర్తి సిద్ధంగా ఉన్నాం..

(మొదటి తరువాయి)

36 మంది గాయపడ్డారు. ఈ ఆత్మాహుతి బాంబు దాడికి తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్థాన్ బాధ్యత వహించింది. అయితే, ఈ దాడి విషయంలో పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్.. భారత్‌ను దోషిగా చూపే ప్రయత్నం చేశారు. ఈ దాడి వెనుక న్యూఢిల్లీ మద్దతు గ్రూపుల ప్రమేయం ఉందని ఆయన ఆరోపించారు

## అమెరికాలో ముగిసిన షట్‌డౌన్..

(మొదటి తరువాయి)

ఎదురుచూశారు. కానీ డెమొక్రాట్లు తగ్గకపోవడంతో.. ట్రంప్ సర్కారు షట్‌డౌన్ ప్రకటించింది. సేనేట్‌లో రిపబ్లికన్లకు కంట్రోల్ ఉన్నా.. బిల్లును పాస్ చేయించుకోలేకపోయారు. ఫండింగ్ బిల్లు సేనేట్‌లో పాస్ కాకపోవడం వల్ల నిరవధికంగా ప్రభుత్వ షట్‌డౌన్ ప్రకటిస్తున్నట్లు వైట్‌హౌజ్ పేర్కొన్నది. దాదాపు 43 రోజుల పాటూ షట్‌డౌన్ కొనసాగింది. అమెరికా చరిత్రలో అత్యధిక కాలం కొనసాగిన 'షట్‌డౌన్'గా రికార్డు సృష్టించింది. ఈ షట్‌డౌన్ కారణంగా భారీగా నష్టం వాటిల్లింది. ఈ షట్‌డౌన్‌తో లక్షలాది మంది అమెరికన్ల జీవితాలు సంక్షోభంలో చిక్కుకున్నాయి. ప్రభుత్వ షట్‌డౌన్ ప్రభావం ముఖ్యంగా విమానయాన రంగంపై తీవ్రంగా పడింది. షట్‌డౌన్ సమయంలో ఎలాంటి జీతం లేకుండా పనిచేస్తున్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు, టీఎస్ఏ సిబ్బంది అనారోగ్య కారణాలతో విధులకు గైర్హాజరు కావడంతో దేశవ్యాప్తంగా పలు విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలు ఆలస్యంగా అయ్యాయి. పరిమిత సంఖ్యలో ఉన్న ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్‌పై ఒత్తిడి తగ్గించడానికే ప్రభుత్వం విమాన సేవల్లో కోతను కూడా విధించింది

### ఆర్టీసీ ఆదాయ మార్గంలో పయనించేలా చేయండి

(మొదటి తరువాయి)

చర్చించాలన్నారు. హైదరాబాద్‌లో కొత్త డిపోలకు స్థల పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. బస్సు ప్రమాదాలను తగ్గించడానికి డ్రైవర్ మానిటరింగ్ సిస్టం అమలు చేస్తామని వివరించారు. త్వరలో ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లతో జూమ్ మీటింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

మహాలక్ష్మి పథకం వచ్చిన తర్వాత సంక్షోభంలో ఉన్న ఆర్టీసీ క్రమక్రమంగా లాభాల బాటలోకి వస్తున్నప్పటికీ ప్రభుత్వం నుంచి నెల వారిగా వస్తున్న మహాలక్ష్మి టికెట్ ఆదాయమే కాకుండా అదనపు ఆదాయంపై దృష్టి సాధించాలని సచివాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. తాజాగా ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఆర్టీసీ లో ఇప్పటి వరకు మహిళలాలు 237 కోట్ల జీరో టికెట్ ఉపయోగించుకున్నారని తెలిపారు. 7980 కోట్ల రూపాయలు ఆర్టీసీ కి ప్రభుత్వం చెల్లించిందని వెల్లడించారు. టికెట్ ఆదాయంతో పాటు టికెట్ యేతర ఆదాయంపై దృష్టి సారించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ అధికారులకు దిశా నిర్దేశర చేశారు. ఆర్టీసీ బస్సులు ,బస్ స్టేషన్ లలో / టీమ్ మిషన్ ల ద్వారా వచ్చే టికెట్ పై అడ్వటంల్గ÷జ్మెంట్స్ ద్వారా ఆదాయాన్ని మరింత పెంచాలని సూచించారు.

# 32 కార్లతో భారీ కుట్ర

(మొదటి తరువాయి)

ఈ 32 కార్లతో ఢిల్లీతో సహా దేశంలోని పలు నగరాల్లో ఏకకాలంలో దాడుల కోసం ఉపయోగించాలని అనుమానిత ఉగ్రవాదులు భావించినట్లు అధికారులు గుర్తించారు. నిందితులు దాడుల కోసం ఐ20, ఎకోస్పోర్ట్ వంటి కార్లను ఎంపిక చేసుకుని.. వాటిని పేలుడు పదార్థాలను నింపేందుకు వీలుగా మాడిఫై చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. సీరియల్ పేలుళ్లకు పాల్పడాలన్నదే వారి ప్రధాన ఉద్దేశమని భద్రతా ఏజెన్సీల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ఇప్పటి వరకు నాలుగు కార్లను గుర్తించారు. ఇవన్నీ పాత కార్లుగా తేలాయి. దాడుల కోసం పాత కార్లను ఉగ్రవాదులు కొనుగోలు చేసినట్లు అధికారులు గుర్తించారు. ఇప్పటికే బ్రెజ్జా, స్విఫ్ట్, ఎకోస్పోర్ట్ వంటి కార్లను పోలీసులు గుర్తించారు. బ్రెజ్జా కారు హర్యానాలోని ఫరీదాబాద్( ఈజీసతిటజీశిజీట)లోని అల్-ఫలాహ్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ క్యాంపస్‌లో కనుగొనబడింది. అలానే ఎకోస్పోర్ట్ కారు బుధవారం రాత్రి హర్యానాలోని ఫరీదాబాద్‌లో కనుగొనబడింది. మరోవైపు ఈ 32 కార్ల ద్వారా నాలుగు వేర్వేరు



లొకేషన్లలో దాడులకు వినియోగించాలని మొత్తం ఎనిమిది మంది అనుమానిత ఉగ్రవాదులు ప్రణాళిక వేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు. ఈ దాడుల కోసం అవసరం అయ్యే పేలుడు పదార్థాల కొనుగోలుకు వైట్‌కాలర్ డాక్టర్లు నిధులు సమకూర్చారని పేర్కొన్నారు. నిందితులు సుమారు రూ. 26 లక్షల నిధిని సేకరించినట్లు సమాచారం. ఈ నిధులను పోగు చేసిన అనుమానితుల్లో డాక్టర్ ముజమ్మిల్ గన్నై, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, డాక్టర్ షహీన్ సయ్యిద్, డాక్టర్ ఉమర్ నబీ ఉన్నారని అధికారులు గుర్తించారు. ఈ నిధులను ఉగ్ర కార్యకలాపాలను నిర్వహించేందుకు ప్రధానంగా డాక్టర్ ఉమర్ నబీ ఉపయోగించినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఉన్నత విద్యావంతులు, వైట్‌కాలర్ ఉద్యోగులు ఉగ్ర కుట్రలో భాగం కావడాన్ని కేంద్ర ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి.

# పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్

(మొదటి తరువాయి)

ఢిల్లీలో గురువారం జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు-భారతదేశం వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి ప్రసంగించారు. తెలంగాణలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తో పాటు అనేక పార్టీలు ప్రభుత్వాలకు సారథ్యం వహించినా పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు అందరూ మద్దతుగా నిలిచారని ముఖ్యమంత్రి వివరించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.

గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రి వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ భారత దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే లండన్, టోక్యో, దుబాయి, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని సీఎం అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ట్రిపుల్ ఆర్ మధ్య మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ వంటి కీలక ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల పురోగతిని వివరించిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి చైనా 1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని అన్నారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే తక్కువ ఖర్చు, సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలను ఆహ్వానించారు. భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నేతల పేర్లు ఉంటాయని హైదరాబాదులో ఆ ట్రెండ్ ను మార్చాలని తాము అనుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీ పేర్లను పెడతామని సీఎం అన్నారు. హైదరాబాద్‌లో రోడ్లకు నేతల పేర్లు పెట్టే ట్రెండ్ మార్చి.. ప్రముఖ కంపెనీల పేర్లు పెట్టాలని భావిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి విశ్వవిద్యాలయాలు తెలంగాణలో క్యాంపస్‌లు ఏర్పాటు చేయాలని సీఎం ఆహ్వానించారు. అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన మొదటి ప్రాధాన్యత అని వివరించారు. భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారనుందన్నారు. మూసీ నదీ పునరుజ్జీవనం పూర్తయితే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని పేర్కొన్నారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితో పాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యత అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. గత 23 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం వివరించారు. అద్భుతమైన మౌలిక వసతులతో 30 వేల ఎకరాల్లో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీ దేశంలోనే నూతన నగరంగా మారుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. సదస్సు ప్రారంభంలో తెలంగాణరైజింగ్ 2047 విజన్ ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యం ఢిల్లీలో వార్షిక సమావేశంలో విశేష ఆదరణ పొందింది. గ్లోబల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడుల అవకాశాలు వివరించిన సీఎం ప్రసంగం, అంతర్జాతీయ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. రేవంత్ రెడ్డి విజన్ బోల్డ్, క్లియర్, అచీవబుల్ అని సిస్కో మాజీ సీఈఓ, టెక్ దిగ్గజం జాన్ ఛాంబర్స్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా, సాధించగలిగేలా ఉంది. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆహ్వానం మేరకు మా సభ్యులలో అత్యధికులం డిసెంబర్ 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతాం అనిడా. ముఖేష్ ఆఘి అన్నారు. తెలంగాణ విజన్‌ను దగ్గరగా తెలుసుకోవాలని మేమంతా ఆసక్తిగా ఉన్నాం. . డిసెంబరు 8,9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కానున్నట్లు అమెరికా-భారత్ వ్యూహాత్మక ఫోరం అధ్యక్షుడు ముఖేష్ ఆఘి తెలిపారు.

## నేడే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు

**10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తి**
**కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బంది**
**జూబ్లీహిల్స్ కౌంటింగ్‌కు ఏర్పాట్లు పూర్తి**
**కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో లెక్కింపు**
**పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభం**
**42 టేబుళ్లు ఏర్పాటు చేసినట్లు ఆర్వో కర్ణన్ వెల్లడి**

| జూబ్లీహిల్స్ బైపోల్–2025 | |
|---|---|
| మొత్తం ఓట్లు | 4,01,365 |
| పోలైన ఓట్లు | 1,94,621 |
| అభ్యర్థుల సంఖ్య | 58 |

**హైదరాబాద్,**
జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని ఆర్వో కర్ణన్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలోని డీఆర్సీ సెంటర్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. 407 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఓట్లు లెక్కిస్తాం. మొత్తం 58 మంది అభ్యర్థులు ఉన్నందున ప్రత్యేక అనుమతి తీసుకుని లెక్కింపునకు 42 టేబుళు ఏర్పాటు చేశారు. 10 రౌండ్లలో కౌంటింగ్ పూర్తిచేస్తామని తెలిపారు.. కౌంటింగ్‌కు మొత్తం 186 మంది సిబ్బందిని కేటాయించాం. ఫలితాలను ఎప్పటికప్పుడు ఈసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తామన్నారు. మీడియాకు ప్రత్యేకంగా ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేసి ఫలితాలను వెల్లడిస్తాంఅని చెప్పారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద 250 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశామని నగర జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. 15 ప్లాటూన్ల సిబ్బందిని రప్పిస్తున్నామన్నారు. 144 సెక్షన్ అమల్లో ఉంటుందని.. అనుమతి ఉన్నవారు మాత్రమే లెక్కింపు కేంద్రం వద్దకు రావాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం వాటిల్లితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపోతే ఓట్ల లెక్కింపు సందర్భంగా సాయంత్రం 6 వరకు మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి.

## సీఐఐ సదస్సుకు విశాఖ ముస్తాబు

(మొదటి తరువాయి)

సీఐఐ సదస్సుకు ముందే వివిధ కంపెనీలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలను కుదుర్చుకుంటోంది. ఈ ఒప్పందాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. విశాఖపట్నం సీఐఐ పార్టనర్ షిప్ కన్నా ముందే సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తైవాన్ కంపెనీలతో రెండు కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనుందని సీఎం తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా రాష్ట్ర పారిశ్రామికవృద్ధి మరింత అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 400 కోట్ల రూపాయిలతో కుప్పంలో 470 ఎకరాల్లో పరిశ్రమ ఏర్పాటు చేస్తుందని.. దీని వలన 50 వేలమందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు రానున్నాయని తెలిపారు. మిజోలి ఇండియా జెవి, మిజోలి యూఎస్ఏ, క్రియేటివ్ సెన్సోర్ (తైవాన్), సినేస్టి టెక్నాలజీలు 23 జిడబ్ల్యూహెచ్ ఫ్రికర్సర్ ఫ్రి సింగిల్ క్రిస్టర్ క్యాతోడ్ యాక్టివ్ మెటీరియల్, సాలిడ్ స్టేట్ ఎలక్ట్రోలైట్ మ్యానిఫ్యాక్చరింగ్ ఫేసిలిటిని ఓర్వకల్లు, కర్నూలులో రూ.18 వేల కోట్లతో ఏర్పాటు చేయనుంది. వీటివల్ల 2 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు రానున్నాయన్నారు. ఈ అవగాహన ఒప్పందాలు స్వర్ణాంధ్రా విజన్ 2047 సాధించడంలో కీలక భూమిక పోషిస్తాయని... వికాసిత్ భారత్ వైపు నడిపిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు. తైవాన్ కంపెనీల పెట్టుబడులకు ఏపీ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు. పెట్టుబడులు, పరిశ్రమలకు అత్యంత అనుకూలంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. పెట్టుబడుల సదస్సులో భాగంగా విశాఖకు వచ్చిన తైవాన్ బృందం సీఎంతో భేటీ అయింది. తైపీ ఎకనామిక్ అండ్ కల్చర్ సెంటర్ ప్రతినిధి, రాయబారి ముమిన్ చెన్ నేతృత్వంలోని బృందం చంద్రబాబును కలిసింది. వివిధ రంగాల్లో వచ్చే ప్రాజెక్టులకు అనుకూలంగా ఏపీలో పారిశ్రామిక కారిడార్లను తీర్చిదిద్దుతున్నామని తైవాన్ బృందానికి సీఎం తెలిపారు. నైపుణ్యం ఉన్న మానవ వనరులు, ప్రపంచస్థాయి ప్రమాణాలతో మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామన్నారు.

# లోయపల్లి శాఖలో విజిలెన్స్ అవేర్‌నెస్ కార్యక్రమం




**మంచాల, నవంబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణ గ్రామీణ బ్యాంక్ లోయపల్లి శాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవేర్‌నెస్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రీజినల్ మేనేజర్ డి.వి.ఎస్. రామారావు హాజరై విజిలెన్స్ అవేర్‌నెస్ ప్రాముఖ్యతను వివరించారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు అవసరమని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో రీజినల్ బిజినెస్ మేనేజర్ కిరణ్ సింహా, రీజినల్ ఆపరేషన్ మేనేజర్ సుమన్, బ్యాంక్ మేనేజర్ బద్రాయ్య, క్యాషియర్ విజయ్, బ్యాంక్ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మంచాల గ్రామంలో విహెచ్పిఎస్ నూతన అధ్యక్షుడి ఎన్నిక



**మంచాల, నవంబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
విహెచ్పిఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి అశ్వాల బాలరాజ్ అధ్యక్షతన మంచాల గ్రామ నూతన అధ్యక్షుడిగా శ్రీ కాలే మల్లయ్యను వికలాంగుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి చీర రమేష్‌ను కార్యవర్గ సభ్యుడిగా ఎంపిక చేశారు. మంత్రి కుమారస్వామి, సాతిరి శ్రీనివాస్, ఆవ బీరప్ప, స్వామి, ఏర్పుల రమేష్, గడ్డం కుమారా, చీర సత్తయ్యలు కీలక బాధ్యతలు స్వీకరించారు.చేయూత పింఛన్ల ముఖ్య సలహాదారుడిగా ఏర్ప సాయిలు నియమితులయ్యారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా విహెచ్పిఎస్ సీనియర్ నాయకుడు చిర దానయ్య, మంచాల మండల నాయకులు ఓరుగంటి పూర్ణచందర్, పసుల కృష్ణ, కడారి లింగం, రావుల శ్రీకాంత్, మల్గా లింగం పాల్గొన్నారు. గ్రామ వికలాంగుల సంఘ సభ్యులు గ్యార యాదమ్మ, సాతిరి సరూప, మొగలి అలివేలు, కొల్లోజు కుమార్, మొగిలి రమేష్, మొగిలి మహేష్, డాక్టర్ సమరం బిక్షపతి, ఆవ వెంకటేష్ తదితరులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



**పెద్దపల్లి,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో సోమవారం జరిగిన బాంబు పేలుడు ఘటనకు కారకులైన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని సమతా సైనిక దళ్ రాష్ట్ర నాయకులు మార్షల్ దుర్గం నగేష్ డిమాండ్ చేశారు. ఈ ఘటనలో మృతి చెందిన 12 మందికి సంతాపం తెలియజేసిన ఆయన, ఎర్రకోట పరిసరాల్లోని వ్యాపార దుకాణాలు ధ్వంసమై తీవ్ర నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన, గాయపడిన ఒక్కొక్క కుటుంబానికి రూ. కోటి పరిహారం ఇవ్వాలని, అలాగే నష్టపోయిన షాపు యజమానులు, వ్యాపార సంస్థలకు తగిన నష్టపరిహారం అందించాలని కోరారు.ఉగ్రవాదులను పట్టుకోవడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి, కులమత భేదం లేకుండా వారిని కఠినంగా శిక్షించాలని ఆయన స్పష్టం చేశారు.

# విద్యార్థులు మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



**బాలానగర్, నవంబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బాలానగర్ డివిజన్ పరిధిలోని బ్రైట్ కాన్సెప్ట్ హై స్కూల్‌లో గురువారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో బాలానగర్ సీఐ నర్సింహా రాజు విద్యార్థులకు పలు కీలక సూచనలు చేశారు. సైబర్ నేరాలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని, మాదకద్రవ్యాల అలవాటు భవిష్యత్తును నాశనం చేస్తుందని ఆయన హెచ్చరించారు.సీఐ మాట్లాడుతూ దాదాపు ఎనభై శాతం సైబర్ నేరాలు మొబైల్ ద్వారానే జరుగుతున్నాయని, 'ఈజీ మనీ' అనే వలలో పడకూడదని, 'డిజిటల్ అరెస్టు' అనే మోసం అసలు ఉండదని స్పష్టం చేశారు. తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు వివరాలు లేదా ఓటీపీ అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ చెప్పరాదని విద్యార్థులకు సూచించారు. బ్యాంకు సమస్యలు ఉంటే నేరుగా బ్యాంకును సంప్రదించాలని, అధికారులు ఎప్పుడూ ఫోన్‌లో ఖాతా వివరాలు అడగరని ఆయన వివరించారు.మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతుందని ఆందోళన వ్యక్తం చేసిన సీఐ, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై సమష్టిగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ సరఫరా చేసేవారిని అరికట్టడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని, సమాచారం తెలిసిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీసులకు తెలియజేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐ సరితా రెడ్డి, స్కూల్ కరెస్పాండెంట్ డా. వినోద్ జాదవ్, ఆఫీస్ ఇంచార్జ్ అయేషా బేగం, టీచర్లు వికాస్, అంబికా, నాగార్జునతో పాటు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆల్విన్ కాలనీలో సీసీ రోడ్డు పనుల పరిశీలన



**ఆల్విన్ కాలనీ, నవంబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలో సాయి కల్యాణ మండపం వెనుకవైపు సుమారు ఇరవైఐదు లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జి.ఎచ్.ఎమ్.సి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. వర్షపు నీరు నిలిచిపోకుండా ముందస్తు ప్రణాళికలతో పనులు చేయాలని సూచించారు.కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, పోశెట్టిగౌడ్, బి. వెంకటేష్ గౌడ్, రఘు, నరసింగరావు, కృష్ణయ్య, ఖాదీర్, ఇజాక్, గోపీచంద్, నాగేశ్వరరావు, కాలనీ వాసులు, ఎ.ఇ. శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



**మహబూబాబాద్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులు అరుగాలం శ్రమించి సాగు చేసిన వరి దాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి క్వింటాకు రూ.2,389 మద్దతు ధర పొందాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్ సూచించారు. జిల్లా కంబాలపల్లి, ముడుపుగల్ గ్రామాలలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని 17 శాతం తేమతో ఉంచి విక్రయిస్తే, ప్రభుత్వం అందించే మద్దతు ధరతో పాటు సన్నరకం దాన్యానికి క్వింటాకు అదనంగా రూ.500 బోనస్ పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, రెవిన్యూ అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# అమ్రాబాద్‌లో రోడ్ల విస్తరణ, డ్రైనేజ్ పనుల పరిశీలన



**అమ్రాబాద్, నవంబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
అమ్రాబాద్ మండల కేంద్రంలో రోడ్ల విస్తరణ, డ్రైనేజ్ పనుల నాణ్యతను అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా తాత్కాలిక రహదారి ద్వారా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కాంట్రాక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, తుఫాను కారణంగా దెబ్బతిన్న రహదారులు, ఇళ్లపై పంచాయతీరాజ్ శాఖతో పాటు సంబంధిత విభాగాల అధికారులు అంచనా వేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు బాల్ లింగం గౌడ్, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు వెంకటయ్య, తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు చింతల గోపాల్, ఇమ్మడి వెంకటేశ్వర్లు, డైరెక్టర్ తిరుమలయ్య, సురేష్, కృష్ణయ్య ఖారత్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే



**ఆమనగల్లు, నవంబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఆమనగల్లు మండల పరిధిలోని పోలేపల్లి గేట్ వద్ద శ్రీ అభిషేక్ కాటన్ మిల్స్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు న్యాయమైన ధర లభించేలా, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా సాగాలని ఆయన సూచించారు. పత్తి రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ కేంద్రం ద్వారా వారికి తక్షణ సాయం అందుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో సీపీఓ రాజీవ్, మిల్ యజమాని అనంతరెడ్డి, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీతా నర్సింహ, వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు వస్పుల శ్రీశైలం, రమేష్ గౌడ్, జంగయ్య గౌడ్, ఉడుతల యాదయ్య, శ్యాంసుందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బడిలోనే పిల్లల బంగారు భవిష్యత్తు



**ఎలిగేడు, నవంబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఎలిగేడు మండలంలోని సుల్తానాబాద్‌లో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలో ముందస్తు బాలల దినోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి మాట్లాడుతూ నిష్ణాతులైన అధ్యాపకులచే అత్యున్నత బోధన ద్వారా బాలల భవిష్యత్తుకు బడిలోనే బీజాలు వేయబడతాయని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి భావి భారత పౌరులని, వారు మంచి క్రమశిక్షణతో ఉన్నతమైన చదువులు చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు, గురువులకు పేరు ప్రఖ్యాతలు తేవాలని సూచించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై శిక్షణ






**కడ్తాల్, నవంబర్ 13 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ )** కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో కడ్తాల్ మండలం అనుమాస్ పల్లిలో నిర్వహించిన వాతావరణ మార్పులపై రెండు రోజుల శిక్షణ శిభిరం గురువారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుప్రీమ్ కోర్టు ఫార్మర్ న్యాయమూర్తి జస్టిస్ ఆర్.సుభాష్ రెడ్డి పాల్గొని రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల నుండి పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి భావితరానికి బాధ్యతాయుతమైన పౌరులను అందించే గొప్ప బాధ్యత, విద్యార్థులను అత్యుత్తమైన ప్రతిభ కలిగిన వారిగా మలచగలిగే నిరంతర శ్రామికులు ఉపాధ్యాయులు, రాజ్యాంగంలో పేర్కొన్న ఆర్టికల్స్ 48ఏ,51ఏ స్ఫూర్తితో పర్యావరణ పరిరక్షణ చేపట్టాలని పిలుపునిచ్చారు. పర్యావరం ఇప్పటికే చాలా విధ్వంసం అయ్యింది, ఇప్పటికైనా మనం మేల్కొని నీటి, వాయు, నెల కాలుష్యాన్ని అరికట్టకపోతే ఈ పుడమిపై జీవం ప్రశ్నార్థకం. ఈ విధ్వంసం ఇలా కొనసాగకుండా భావి తరాలకు ఈ పుడమిని, సహజవనరులను సురక్షితంగా అందించడానికి ఉపాధ్యాయులు విద్యార్థులకు చిన్న వయసు నుండి పర్యావరణ పరిరక్షణపై కంకణబద్ధులై పర్యావరణ హితమైన కార్యక్రమాలను పాఠశాలలో చేపట్టాలన్నారు. సి జి ఆర్ సంస్థ గత 15 సంవత్సరాలుగా నిర్విరామంగా నిర్వహించే ఈ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం చాలా అభినందించారు. ఈ సందర్భంగా జస్టిస్ పాఠశాలలో తనకి విద్యని బోధించిన ఉపాధ్యాయులు రత్నం,వెంకట్ రావు మొదలైన గురువులను స్మరించుకున్నారు. అనంతరం బహిరంగ ప్రదేశాల్లో చెత్తను కాల్చడం వల్ల కలిగే నష్టాలను కరపత్రాలను విడదల చేసి పర్యావరణ ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సి జి ఆర్ సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి ,అధ్యక్షురాలు లీలా లక్ష్మారెడ్డి, మరియు యంగ్ ఎర్త్ లీడర్స్ ప్రోగ్రాం స్టేట్ కోఆర్డినేటర్ యానాల వెంకట్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, డా. నక్కా సాయిభాస్కర్ రెడ్డి, ఉమా మహేశ్వర్ రెడ్డి పర్యావరణ శాస్త్రవేత్తలు, రవీందర్ రావు , గాయకులు లెనిన్ , ఔషద మొక్కల నిపుణులు రఫీ యొద్దిన్. తదితరులు పాల్గొన్నారు.

## రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమం ఉధృతమే



**పెద్దపల్లి, నవంబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో గురువారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దాసరి ఉష డిమాండ్ చేశారు. ఈ దీక్ష శిబిరాన్ని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ సందర్శించి సంఘీభావం తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ఆయన కోరారు.దాసరి ఉష మాట్లాడుతూ, రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గ్రామ స్థాయి వరకు కమిటీలు వేసుకుని పోరాటాన్ని కొనసాగిస్తామని, ఈ ఉద్యమం తెలంగాణ పోరాటం, స్వాతంత్ర్య పోరాటం తరహాలో ఉంటుందని, ప్రతి ఇంటి నుంచి ఒక నాయకుడు తయారయ్యేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లవెల్లి శంకర్, జిల్లా వైస్ చైర్మన్ కొండి సతీష్, మహిళా కన్వీనర్ సిరవేన స్వప్న, జిల్లా కన్వీనర్ సలేంద్ర కొమరయ్య యాదవ్, మీడియా ఇన్చార్జ్ అబ్దుల్ మాలిక్, బీసీ నాయకులు శిలారపు పర్వతాలు యాదవ్, ఆకుల వివేక్ పటేల్, ఏ. రాజేందర్, కే. నవీన్ యాదవ్, డి. రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## నవంబర్ 15న యూనిటీ మార్చ్ నిర్వహణ






**పెద్దపల్లి, నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా నవంబర్ 15న యూనిటీ మార్చ్ నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ డి. వేణు తెలిపారు. గురువారం ఆయన పత్రికా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 763 గ్రామాల్లో యూనిటీ మార్చ్ నిర్వహిస్తోందని, పెద్దపల్లి జిల్లాలో కూడా నవంబర్ 15న ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాల నుంచి జూనియర్ కళాశాల వరకు మార్చ్ జరగనుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు పాల్గొనే అవకాశం ఉందని తెలిపారు.జిల్లా యువజన క్రీడా శాఖ అధికారులు అన్ని కళాశాలలకు సమాచారం అందించి విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని సూచించారు. స్కౌట్, ఎన్‌సిసి బృందాలు కూడా పాల్గొనాలని, కార్యక్రమం ప్రశాంతంగా సాగేందుకు భద్రతా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశించారు. అనంతరం యూనిటీ మార్చ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా యువజన అధికారులు సురేష్, వెంకట్ రాంబాబు, కళాశాల ప్రిన్సిపల్స్ రవీందర్ రెడ్డి, నీతా రెడ్డి, సీఐ ప్రవీణ్ కుమార్, పీటీలు, ఎన్‌సిసి అధికారి ధ్రువ్ కుమార్, సంబంధిత అధికారులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో బీసీ ధర్మ పోరాట దీక్ష



**హుస్నాబాద్,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీసీ జేఏసీ పిలుపు మేరకు హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో గురువారం ధర్మ పోరాట దీక్ష జరిగింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని వక్తలు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన వంతు బాధ్యతను పూర్తి చేసిందని, ఇక కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును ఆమోదించి రిజర్వేషన్లు కల్పించాల్సిన సమయం వచ్చిందని వారు పేర్కొన్నారు. కేంద్రం బీసీలకు అనుకూలమా, లేక ద్రోహి గానా ఉంటుందో ఈ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వక్తలు స్పష్టం చేశారు. బీసీ జేఏసీ పిలుపునిచ్చిన అష్టాంగ ఆందోళనకు బీసీ సమాజం, సహచర సామాజిక కులాలు స్పందించి ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ దీక్షలో కాంగ్రెస్, బీఆర్ఎస్, సిపిఐ, బీఎస్పీ పార్టీలు, మాలమహానాడు, జనజాగృతి కళాసమితి, బీసీ కుల సంఘాలు పాల్గొన్నాయి.

దీక్షను బీసీ జేఏసీ కోఆర్డినేటర్ మేకల వీరన్న యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు చిత్తారి రవీందర్, మాజీ ఎం.పి.పి ఆకుల వెంకన్న, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అన్వర్, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు పచ్చిమట్ల రవీందర్ గౌడ్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేష్, కాంగ్రెస్ నాయకులు గంపల శ్రీనివాస్, ఇల్లందుల లక్ష్మణ్ గౌడ్, మెతుకు కొమురయ్య, మాజీ కౌన్సిలర్ చిత్తారి పద్మ, నాయిని రజిత, కోడూరి శ్రీదేవి, పెరుమాండ్ల నర్సాగౌడ్, గట్టు రాములు, కోడం ప్రభాకర్, మార్క అనిల్ గౌడ్, లుపెరుక భాగ్యరెడ్డి, వడ్డేపల్లి వెంకట రమణ, కోమటి సత్యనారాయణ, వెన్న రాజు, నోముల బాలయ్య, పచ్చిమట్ల శ్రీకాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలయ్య, మాజీ సర్పంచ్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికుల నిధుల రక్షణ కోసం నిరంతర ఆందోళనలు అవసరం

**జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశం తీర్మానం**




**కరీంనగర్,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో భవన నిర్మాణ కార్మికుల జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కార్మికుల నిధుల రక్షణ కోసం నిరంతర ఆందోళనలు కొనసాగించాలని నిర్ణయించారు.జేఏసీ నాయకులు మాట్లాడుతూ వెల్ఫేర్ బోర్డు అడ్వైసర్ కమిటీ ద్వారా నిధులు మంజూరు చేయాలని, సిఎస్‌సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలని, వెల్ఫేర్ స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన అనుమతిని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. సహజ మరణానికి ఐదు లక్షల పరిహారం ఇవ్వాలని, 13 లక్షల కార్డులను వెంటనే రీన్యువల్ చేయాలని, పెండింగ్ క్లెయిమ్స్‌కు నిధులు విడుదల చేయాలని కోరారు. జిల్లా లేబర్ అధికారుల అవినీతి అరికట్టాలని, బ్రోకర్లు, ఏజెంట్లతో పనిచేస్తున్న అధికారులను సస్పెండ్ చేయాలని, అధిక ఫీజులు వసూలు చేస్తున్న మీ సేవ కేంద్రాలను సీజ్ చేయాలని తీర్మానం చేశారు. ఈ డిమాండ్ల సాధనకై నవంబర్ 17న కార్మిక మంత్రి, లేబర్ కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేయాలని, 25న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మహాధర్నా, డిసెంబర్ 5న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ యూనియన్ అధ్యక్షుడు బుచ్చన్న యాదవ్, జిల్లా అధ్యక్షులు గందె కొమురయ్య, ప్రధాన కార్యదర్శి పిట్టల సమ్మయ్య, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కదిరే రమేష్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేష్, బి ఆర్ టి యు అధ్యక్షుడు ఆకుల మల్లేశం, ప్రధాన కార్యదర్శి బొంకురు రాములు, ఏఐటీయూసీ నాయకులు రేగుల కుమార్, స్వతంత్ర సంఘాల నాయకులు గామినేని సత్యం, రమేష్, సంతోష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## వెల్జాల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ



**తలకొండపల్లి,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా వెల్జాల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ కార్యక్రమం ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు గందె సురేష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గందె సురేష్ మాట్లాడుతూ, గురువులు బోధించిన విద్యను శ్రద్ధగా వింటూ ఉన్నత స్థాయిలో ఎదగాలని విద్యార్థులను ప్రోత్సహించారు. అలాగే వెల్జాల్ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బుక్స్ కమిటీ చైర్మన్, ఫరూక్‌నగర్ మండల అధ్యక్షులు ఎల్కుర్తి నారాయణ, మండల మాజీ అధ్యక్షులు అన్మరి మురళి, ఎల్కుర్తి జగదీశ్వర్, సామాజిక కార్యకర్త నీల రవీందర్, కార్యవర్గ సభ్యులు కరుణాకర్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రీనివాస్ యాదవ్, కున శ్రీనివాస్, శివ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టి పీడిస్తున్న గూడూరు ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం.

-ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం
-ఎస్సై హనుమంత రెడ్డి.



**గూడూరు నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గూడూరు నగర పంచాయితీలో గత సంవత్సరాలుగా ప్రధానంగా, బస్టాండులో ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసే, ప్రయాణికులకు గూడూరు ప్రజలకు చుట్టుపక్కల నుండి వచ్చే గ్రామాలకు ప్రజలకు నిత్యం తలనొప్పిగా పట్టిపీడిస్తున్న ట్రాఫిక్ సమస్యను ఎట్టకేలకు ఎస్.ఐ హనుమంత రెడ్డి పరిష్కారం దిశగా అడుగులు వేశారు, ట్రాఫిక్ సమస్య నివారించడం కోసం సిబ్బందితో కలిసిఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు, ఎస్సై హనుమంత రెడ్డి ట్రాఫిక్ సమస్యపై పెట్రోలింగ్ నిర్వహించి, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించ దిశగా అడుగులు వేసిన ఎస్.ఐ. హనుమంత రెడ్డి,ని గూడూరు నగర ప్రజలు, మండల ప్రజలు, ప్రజా సంఘాలు ,రాజకీయ పార్టీలు,ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. ఎస్సై హనుమంత రెడ్డి మాట్లాడుతూ రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలిపి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే వారిపై శాఖ పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# మన్ననూర్‌లో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ స్థల పరిశీలన



**అమ్రాబాద్,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్ గ్రామంలో ట్రైబల్ వెల్ఫేర్ ప్రభుత్వ పాఠశాలలో రూ. 2 కోట్ల 70 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన ఇంటిగ్రేటెడ్ హాస్టల్ భవనానికి కావలసిన స్థలాన్ని టిపిసిసి ఉపాధ్యక్షులు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జూలూరీ సత్యనారాయణ, శంభు, శంభు వెంకటరమణ, దాసరి శ్రీనివాసులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అధికారులు, అభిమానులు పాల్గొన్నారు.

# వెంకటేశ్వర స్వామి దర్శనం చేసుకున్న యాదయ్య



**మహేశ్వరం, నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని అమీర్‌పేట్ గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా అధ్యక్షులు ఎర్ర నవీన్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బాలకృష్ణ, దేవాలయ పూజారి ప్రేమ్ శర్మ పంతులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# పెండింగ్ జీతాల కోసం నవంబర్ 17న కలెక్టరేట్ వద్ద ధర్నా



**కరీంనగర్, నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలో పనిచేస్తున్న సానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డ్స్, ప్లంబర్ కార్మికుల రెండు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే చెల్లించాలని ప్రభుత్వ హాస్పిటల్ వర్కర్స్ & ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు హాస్పిటల్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ గౌరవ అధ్యక్షులు బండారి శేఖర్ మాట్లాడుతూ, ఆదివారం లోపు జీతాలు చెల్లించకపోతే నవంబర్ 17న జిల్లా కలెక్టరేట్ వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రతి రెండు నెలకొకసారి కార్మికులు ఆందోళనలు చేయాల్సి వస్తోందని, ఏజిల్ కాంట్రాక్టు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి 542 బెడ్లకు రావలసిన బిల్లు, కేవలం 332 బెడ్లకే వస్తోందని, దీనివల్ల కార్మికుల జీతాలు నిలిచిపోతున్నాయని తెలిపారు. గతంలో అనేకసార్లు డిఎంఇ వద్ద సమస్యను విన్నవించినప్పటికీ పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి 500 బెడ్లకు సాంక్షన్ చేస్తూ జీవో నెం.694 (29-11-2024) ఇచ్చినా, బిల్లు మాత్రం 332 బెడ్లకే వస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్మికులకు రెగ్యులర్‌గా జీతాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని యూనియన్ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పి. అరుణ్, రాజు, నరేష్, రాజయ్య, వేణు, శేఖర్, అరుణ, రాజేశ్వరి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

# చండూరు తహసిల్దార్ గా బాధ్యతలను చేపట్టిన రమాకాంత్

**చండూర్, నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
చండూరు మండలం నూతన తహసిల్దార్ గా రమాకాంత్ శర్మ, బాధ్యతలు స్వీకరించారు. గతంలో చింతపల్లి మండలం లో పనిచేసిన అయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇంచార్జ్ తహసిల్దార్ గా పనిచేసిన చంద్రశేఖర్, ఇకపై డిప్యూటీ తహసిల్దార్ గా కొనసాగుతారు. నూతన తహసిల్దార్ రమాకాంత్ శర్మ, మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యలను నేరుగా తన వద్దకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా సూచించారు.

# ఓయూ నుంచి డాక్టరేట్ పొందిన చుక్కలతకు ఘన సన్మానం



**కరీంనగర్, నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పట్టణం ఉస్మాన్‌పూర్‌కు చెందిన చుక్క నరసయ్య -పోచమ్మ దంపతుల కుమార్తె చుక్కలత ఉస్మానియా యూనివర్సిటీ సోషియాలజీ విభాగం నుంచి డాక్టరేట్ పొందిన సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకులు డా. పుల్లెల పవన్, సొల్లు అజయ్ వర్మ ఆమెను గురువారం ఘనంగా సన్మానించారు. ప్రొఫెసర్ సునంద పాండే పర్యవేక్షణలో “రిసెర్చ్ స్కాలర్స్ ఆస్పిరేషన్స్, జాబ్ అపోర్చునిటీస్ అండ్ ఎడ్యుకేషనల్ వేస్టేజీ ఏ కంపరేటివ్ స్టడీ ఆఫ్ సెలెక్టెడ్ యూనివర్సిటీస్ ఇన్ ఇండియా” అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు గాను ఓయూ పరీక్షల విభాగం చుక్కలతకు డాక్టరేట్‌ను ప్రకటించింది. చిన్ననాటి నుంచే కష్టపడి చదువుతూ నాలుగు పీజీ కోర్సులు, ఒక బిఈడ్ పూర్తి చేసిన లత, తల్లి పోచమ్మ స్వీపర్‌గా పనిచేస్తూ చదివించిన త్యాగాన్ని గుర్తుచేసుకుంది. పీహెచ్డీ చేస్తున్న సమయంలో తల్లి క్యాన్సర్‌తో మరణించినప్పటికీ, అధైర్యపడకుండా మొక్కవోని దీక్షతో పరిశోధన పూర్తి చేసి డాక్టరేట్ సాధించింది. తన పరిశోధనకు సహకరించిన అధ్యాపకులు, మిత్రులకు కృతజ్ఞతలు తెలిపిన ఆమె, ఈ డాక్టరేట్‌ను తల్లిదండ్రులకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించింది.

## ఆర్కపల్లి గ్రామ సమస్యలపై అఖిలపక్షం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



**మాడుగుల,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆర్కపల్లి గ్రామపంచాయతీకి సంబంధించిన వివిధ సమస్యలపై అఖిలపక్షం ఆధ్వర్యంలో నాయకులు ఎమ్మెల్యేను కలిశారు. హైవే నుండి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం, వాగులో బ్రిడ్జి ఏర్పాటు, అలాగే ఆంజనేయస్వామి దేవస్థానం సంబంధిత 33 ఎకరాల భూమి అంశంపై ఆర్డీవోకు ఎమ్మెల్యే ఫోన్ చేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు శీను, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సిరసవాడ శీను, బీజేవైఎం రాష్ట్ర నాయకుడు జమలాపురం రాంకీషన్, హనుమాన్ గుడి చైర్మన్ అంతి రెడ్డి, విష్ణు యాదవ్‌తో పాటు పలువురు నాయకులు ఎమ్మెల్యే నివాసంలో కలిసి సమస్యలను వివరించారు.

# వందేమాతరం గీతం 150వ వార్షికోత్సవం

### శ్రీరంగపూర్‌లో సామూహిక గేయాలాపన



**వనపర్తి నవంబర్ 14 ( నీలగిరి ఎక్స ప్రెస్):**
వందేమాతరం గీతం 150 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా ఉత్సవాలు జరుగుతున్న వేళ, శ్రీరంగపూర్ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సామూహిక గేయాలాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సబ్బిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ బంకిమ్‌చంద్ర ఛటర్జీ వందేమాతరం, పింగళి వెంకయ్య మూడు రంగుల జెండా, రవీంద్రనాథ్ ఠాగూర్ జనగణమన మన దేశానికి అందించారని తెలిపారు. ఈ గీతాలు, జెండాలు పరాయి పాలన కింద నలిగిన జాతిని ఏకం చేశాయని పేర్కొన్నారు. మన స్వేచ్ఛ, త్రివర్ణ పతాకం అనేక త్యాగాల ఫలితమని గుర్తుచేశారు. జమ్మూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు భాషలు, సంస్కృతులు వేరైనా అందరం భారతమాత బిడ్డలమని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు దేశ ఐక్యత కోసం అందరూ పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పురుషోత్తం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాఘవేందర్ గౌడ్, రాములు, రాజేష్, లక్ష్మీనారాయణ, చరణ్, ఆశన్న, ఆనంద్, డాక్టర్ రాములు తదితరులు పాల్గొన్నారు.

# శాతవాహన ఆర్ట్స్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సు




**కరీంనగర్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శాతవాహన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుజాత అధ్యక్షతన యాంటీ ర్యాగింగ్, మహిళా భద్రత, మాదకద్రవ్య నియంత్రణపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి మాట్లాడుతూ విద్యార్థులు సోదరభావంతో ఉండాలని, ర్యాగింగ్ చేసినవారిపై కళాశాల నుండి డిస్మిస్ చేయడమే కాకుండా పోలీస్ కేసు కూడా నమోదు అవుతుందని హెచ్చరించారు. కొత్తపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ కోటేశ్వర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలు విద్యార్థుల జీవితాన్ని చెడగొడతాయని, వాటిని కలిగి ఉండడం, వినియోగించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. షీ టీమ్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలత మాట్లాడుతూ ర్యాగింగ్ పేరుతో అమ్మాయిలను వేధిస్తే కేసు నమోదు అవుతుందని, అలాంటి వారికి ప్రభుత్వ ఉద్యోగం దొరకదని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య సుజాత విద్యార్థులు ఉన్నత చదువుల కోసం విశ్వవిద్యాలయానికి రావాలని, అనవసరంగా తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. హరికాంత్ ర్యాగింగ్‌ను అంతం చేసి స్వచ్ఛ శాతవాహనగా మార్చాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ రమాకాంత్, చీఫ్ వార్డెన్ డా. నజీముద్దీన్ మున్వర్, హాస్టల్ వార్డెన్స్ డా. కృష్ణకుమార్, సావిత్రి, కేర్ టేకర్ సంధ్య, రమేష్ కామర్స్, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కమిటీ సమావేశం విజయవంతం చేయాలి



**కరీంనగర్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈ నెల 18న రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఆజ్మతుల్లా హుస్సేన్ కరీంనగర్ పర్యటనలో భాగంగా జిల్లా వక్ఫ్ బోర్డు ప్రొటెక్షన్ %డ% డెవలప్‌మెంట్ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కమిటీ చైర్మన్ సమద్ నవాబ్ తెలిపారు. నగరంలోని కరీంనగర్ ఫంక్షన్ హాల్‌లో ఉమిద్ పోర్టల్ వక్ఫ్‌కు సంబంధించిన మూడు అంశాలపై చర్చ జరగనుందని, సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడంతో పాటు అవగాహన కల్పించనున్నారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సమద్ నవాబ్ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఈద్గా, దర్గా, ఖబ్రస్తాన్, మస్జీద్, మదర్సా కమిటీ అధ్యక్షులు, సభ్యులు, జిల్లా కాంగ్రెస్ మైనారిటీ నేతలు, మైనారిటీ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఈ సమావేశానికి హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో జిల్లా కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు ఎం.డి. తాజుద్దీన్, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎం.డి. లయీక్, అబ్దుల్ రెహమాన్, ఎం.డి. చాంద్, ఇర్ఫాన్, మొహమ్మద్ ఖలీముద్దీన్, మహమ్మద్ ఆమేర్, మన్సూర్, తవక్కలి తదితరులు పాల్గొన్నారు.

# 45వ డివిజన్లో ఉచిత ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం



**కరీంనగర్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు తప్పనిసరిగా వినియోగించుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, వివిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, “అల్ఫోర్స్” డా. వి. నరేందర్ రెడ్డి అన్నారు. ఆయన స్థానిక 45వ డివిజన్లో యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అజీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ఓటరు నమోదు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇది వారి ప్రాథమిక కర్తవ్యం అని గుర్తు చేశారు. ఓటు ద్వారా ప్రభుత్వం ఏర్పడి ప్రజలకు కావలసిన వసతులు అందుతాయని, భారత ప్రజాస్వామ్యంలో ఓటరుకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా ఓటు హక్కును సక్రమంగా వినియోగించాలని సూచించారు. కార్యక్రమంలో సిటీ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రజిత రెడ్డి, ఎస్టీ సెల్ ప్రెసిడెంట్ శ్రావణ్ నాయక్, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ వాసు, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ అభిలాష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణు, తాళ్లపల్లి శ్రీకాంత్, రాహుల్, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ జాఫర్, ఆశీష్ గౌడ్, ప్రవీణ్ అంజన్ స్వామి, అజీత్ పండిత్, మహమ్మద్ ఎంజాయ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు అభ్యున్నతే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

## ఘనంగా కాళోజీ వర్ధంతి




**హనుమకొండ,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రైతు పండించిన ధాన్యం చివరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ప్రజా ప్రభుత్వం రైతు అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు సాగుతోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గురువారం కాజీపేట సోముడిలో తొలిసారి వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. గతంలో కేంద్రం లేక రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడిన పరిస్థితిని అర్థం చేసుకుని, స్థానికంగా సౌకర్యం కల్పించినందుకు రైతులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ధరలో పారదర్శకత, డబ్బులు నేరుగా రైతుల ఖాతాల్లో జమ అవుతాయని, మధ్యవర్తుల జోక్యం లేకుండా రైతు గౌరవాన్ని కాపాడే దిశలో ఇది పెద్ద అడుగని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, ఎరువుల సరఫరా వంటి పథకాలతో రైతు కుటుంబాలకు పూర్తి మద్దతు అందిస్తున్నామని వివరించారు.మొంథా తుఫాన్ కారణంగా హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిన ప్రజలకు ప్రభుత్వం తక్షణమే అండగా నిలిచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలపై రెండు జిల్లాలకు కలిపి రూ.12.08 కోట్ల వరద సాయం మంజూరు చేశారు. హనుమకొండ జిల్లాకు రూ.7.03 కోట్లు, వరంగల్ జిల్లాకు రూ.5.05 కోట్లు కేటాయించారు. వరంగల్ పశ్చిమ పరిధిలో 48 కాలనీలు నీట మునిగాయి, 4,790 ఇళ్లు దెబ్బతిన్నాయి. ఆ నష్టానికి రూ.7.18 కోట్లు విడుదల చేశారు. అక్టోబర్ 31న వర్షాలు పడితే నవంబర్ 11 నాటికే నిధులు మంజూరు చేయడం ప్రభుత్వ స్పందన ఎంత వేగంగా ఉందో చెప్పే సాక్ష్యమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. గత ప్రభుత్వాలు మాటలకే పరిమితమయ్యాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలతో చూపిస్తోందని ఆయన పేర్కొన్నారు.ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర్భంగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి ఘన నివాళి అర్పించారు. నక్కలగుట్ట ప్రధాన రహదారిలోని విగ్రహానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు సమర్పించారు. తెలంగాణ అస్తిత్వాన్ని, సాహిత్య సాంస్కృతిక గరిమను ప్రపంచానికి చాటిన కాళోజీ కృషి చిరస్మరణీయమని ఎమ్మెల్యే కొనియాడారు.

## నిరంతర విద్యుత్ కోసం కృషి




**తుక్కుగూడ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం తుక్కుగూడ మున్సిపాలిటీలో నిర్వహించిన ప్రజా బాట కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలను టి.జి.ఎస్.పి.డి.సి.ఎల్ కమర్షియల్ డైరెక్టర్ చిలకమర్రి చక్రపాణి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరంతరమైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. వచ్చే వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు, అధిక సామర్థ్యంతో కూడిన ట్రాన్స్‌ఫార్మర్లు, కొత్త లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. విద్యుత్ సిబ్బంది భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జోన్ చీఫ్ ఇంజనీర్ పాండ్య, రాజేంద్రనగర్ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీరామ్ మోహన్, కందుకూరు డీఈ గోపాలకృష్ణ, మామిడి పల్లి ఏడీఈ శంకర్, మహేశ్వరం ఏఈ చక్రపాణి తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాముల సన్నిధాన పనులు పరిశీలించిన సబితా ఇంద్రారెడ్డి



**మహేశ్వరం నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కొత్వాల్ చెరువు తాండ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్వాల్ చెరువు కట్టపై గతంలో ఇంద్రారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్లోళ్ల కార్తీక్ రెడ్డి నిర్మించిన పరమేశ్వరుని 40 అడుగుల భారీ విగ్రహం పక్కన అయ్యప్ప స్వాముల సౌకర్యార్థం నూతనంగా నిర్మిస్తున్న సన్నిధాన పనులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి పి. సబితా ఇంద్రారెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వీలైనంత త్వరగా సన్నిధాన పనులు పూర్తి చేసి స్వాములకు అందుబాటులోకి తేవాలని, మాలదారణ సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ పట్లోళ్ల కృష్ణారెడ్డి, పిఎసిఎస్ వైస్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పోచారం సుధాకర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు ఆదిల్ అలీ, పిఎసిఎస్ డైరెక్టర్ కాడమోని ప్రభాకర్, వద్ది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యం పై బీజేపీ నేత ఆగ్రహం



**కేశంపేట్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కేశంపేట్ మండల వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద గురువారం ఉదయం బీజేపీ నాయకుడు కర్రెడ్ల నరేందర్ రెడ్డి పడిగాపులు కాశారు. వర్షాల కారణంగా రైతులు తీవ్ర పంట నష్టాలను ఎదుర్కొంటున్న తరుణంలో, నష్టపరిహారం వివరాలు తెలుసుకోవడానికి ఆయన ఉదయం 10 గంటలకే కార్యాలయానికి చేరుకున్నారు. అయితే 11.30 గంటలయినా కార్యాలయం తెరుచుకోకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారికి ఫోన్ చేసినా సరైన సమాధానం ఇవ్వలేదని ఆయన విమర్శించారు. రైతులు ఇబ్బందులు పడుతున్న సమయంలో అధికారుల నిర్లక్ష్యం అర్థం కాని విషయమని నరేందర్ రెడ్డి అన్నారు. ప్రభుత్వం నష్టపరిహారం ఇస్తున్నదన్న సమాచారం నేపథ్యంలో, మండల పరిధిలో ఎంతమంది రైతులకు పంట నష్టం జరిగిందో వివరాలు వెంటనే వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు.

## హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదుల ధర్నా



**హుస్నాబాద్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ కోర్టు సీనియర్ న్యాయవాది అనిల్‌కుమార్‌పై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ కోర్టు ఎదుట న్యాయవాదులు ధర్నా చేపట్టారు. చట్టాన్ని రక్షించవలసిన పోలీసులే చట్టాన్ని చేతిలోకి తీసుకొని న్యాయవాదిపై దాడి చేయడం దారుణమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజురోజుకు న్యాయవాదులపై దాడులు పెరుగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా బార్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## పులికొండ గ్రామంలో డెంగ్యూ కేసు నమోదు...



**పత్తికొండ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండల పరిధిలోని పులికొండ గ్రామంలో డెంగ్యూ కేసు నిర్ధారణ కావడంతో పిహెచ్ సి పత్తికొండ సిబ్బంది,మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సందర్శించి వ్యాధిగ్రస్తుని ఇంటి పరిసర ప్రాంతాలు ఇంటి లోపల దోమల మందు పిచికారి చేయించి కాలువలను శుభ్రపరిచారు.స్థానిక ప్రభుత్వ పాఠశాల నందు దోమల ద్వారా వచ్చే వ్యాధుల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఆస్పరి సాయిబాబా, పంచాయతీ సెక్రటరీ విజయ్, రమేష్, ఏఎన్ఎమ్ లు,ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా స్పోర్ట్స్ డే



**హుస్నాబాద్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాలలో క్రీడా దినోత్సవం సందర్భంగా ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి ఆటల పోటీల్లో పాల్గొని ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన హుస్నాబాద్ ఎస్సై లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, క్రీడలు మానసికోల్లాసానికీ, శారీరక ధృడత్వానికీ ఉపయోగపడతాయని అన్నారు. పిల్లలు మొబైల్ వినియోగం, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల శరీర అవయవాలు, ముఖ్యంగా కళ్ళు, మెదడు దెబ్బతిని మానసికంగా ఎదగలేరని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి. రాము మాట్లాడుతూ, క్రీడలు పిల్లలలో పోటీ తత్వం, నాయకత్వ లక్షణాలు, మానసిక ధృడత్వాన్ని పెంపొందిస్తాయని, జీవితంలో క్రీడలు ఒక భాగం కావాలని, భౌతిక ఆటలు భవిష్యత్తులో వారికి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య పాఠశాలల సిద్దిపేట్ జోన్ ఏజీఎం మధుసూదన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని స్పోర్ట్స్ డేను విజయవంతం చేశారు.

## శ్రీ చైతన్య స్కూల్లో స్పోర్ట్స్ మీట్ వేడుకలు



**వేములవాడ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య స్కూల్లో డాక్టర్ బి.ఎస్. రావు జ్ఞాపకార్థం నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుతో పాటు ఆటలు పిల్లలకు ఎంతో అవసరమని, యాజమాన్యం నిర్వహించిన ఈ కార్యక్రమం వారికి ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను పిల్లలతో పంచుకున్న ఆయన, ఆటలు ఆడటం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందని పేర్కొన్నారు. పిల్లలకు ఆహారం పట్ల తల్లిదండ్రులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ వేడుకలో పాఠశాలల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం ముద్రకోల రాజు, అకాడమీ కోఆర్డినేటర్లు ప్రవీణ్, మమతా రెడ్డి, మిర్యాల మమత, ప్రిన్సిపాల్ సుదేష్ కుమారి, లీలావతి, ఇన్చార్జులు అంజయ్య, అరుణ్, రజిత, ప్రవళిక, యశస్విని, హరీష్, పి.ఈ.టి. సుధాకర్, తిరుపతి, మారుతి, కవిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆకునూరి సుధీర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ లో నవీన్ యాదవ్ విజయం తథ్యం



**మహేశ్వరం,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరనుందని మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య విశ్వాసం వ్యక్తం చేశారు. ఈరోజు కాబోయే ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్న లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు యాదయ్య మాట్లాడుతూ – జూబ్లీహిల్స్‌లోని 282 బూత్‌ల పరిధిలో పలు కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించామని, యువ నాయకుడు నవీన్ యాదవ్ విజయం నిర్ధారితమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎర్ర నవీన్ కుమార్, మండల యూత్ కాంగ్రెస్ నాయకులు సిహెచ్ బాలకృష్ణ, ఇతర కార్యకర్తలు, కాంగ్రెస్ అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## వికలాంగుల రాజ్యాధికార ఫోరమ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

**హైదరాబాద్,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిజాం కాలేజీ గ్రౌండ్‌లో ఈరోజు వికలాంగుల రాజ్యాధికార ఫోరమ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంశరాజ్ రామచంద్ర పాల్గొని 15 మంది వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలం నేపథ్యంలో సహాయం అందించడం ద్వారా సమాజంలో సానుభూతి పెంపొందించాలని ఫోరమ్ ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# కొండగట్టులో ఆర్జిత సేవా రుసుం పెంపుపై బండి సంజయ్ ఆగ్రహం



**కొండగట్టు నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కొండగట్టు దేవస్థానంలో ఆర్జిత సేవా రుసుంను భారీగా పెంచడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆలయంలో కనీస సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో, సౌకర్యాలపై దృష్టి పెట్టకుండా రుసుం పేరుతో అడ్డగోలుగా ధరలు పెంచడమేంటని ఆయన ప్రశ్నించారు. ఈరోజు ఉదయం దేవాదాయ శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన బండి సంజయ్, “కొండగట్టు అంజన్న ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాల్లేవు. తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమయంలో సౌకర్యాలపై దృష్టి సారించకుండా ఆర్జిత సేవా రుసుంను పెంచడమేంటి?” అని అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే రుసుం తగ్గించి, కనీస సౌకర్యాల కల్పనపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. భక్తుల ఇబ్బందులను తొలగించే చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ అధికారులను ఆదేశించారు.

# రిటైర్డ్ ఏఎస్ఐ మడుపు రామచంద్రం కన్నుమూత



**కరీంనగర్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పోలీస్ శాఖలో సీనియర్ ఫోటోగ్రాఫర్‌గా సేవలందించి, రిటైర్ అయిన అసిస్టెంట్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఏఎస్ఐ) మడుపు రామచంద్రం అనారోగ్య కారణంగా కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. సుదీర్ఘకాలం పాటు పోలీస్ శాఖకు ఆయన అందించిన సేవలు మరువలేనివి. సీనియర్ ఫోటోగ్రాఫర్‌గా చేసిన కృషి ఎంతోమందికి ఆదర్శప్రాయమైంది. రామచంద్రం స్వగ్రామం కరీంనగర్ రూరల్ మండలంలోని బొమ్మకల్. మడుపు రామచంద్రం గారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాము.

# సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ల అప్పగింత



**కరీంనగర్,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ పట్టణ పరిధిలో పోగొట్టుకున్న మరియు చోరీకి గురైన ఇరవై మొబైల్ ఫోన్లను గుర్తించి బాధితులకు అప్పగించినట్లు టౌన్ ఏసీపీ వెంకటస్వామి తెలిపారు. సీపీ ఆదేశాల మేరకు సి.ఈ.ఐ.ఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్ సహాయంతో ఈ ఫోన్లను రికవరీ చేసి, ఈరోజు ఏసీపీ కార్యాలయంలో యజమానులకు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటస్వామి మాట్లాడుతూ, నేటి రోజుల్లో మొబైల్ ఫోన్ కేవలం సంభాషణ సాధనం మాత్రమే కాకుండా, బ్యాంకు ఖాతాలు, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత సమాచారం వంటి విలువైన వివరాలు ఉంటాయని, దొంగలు బలహీనమైన పాస్‌వర్డ్‌లను ఛేదించి ఫోన్‌పే, గూగుల్‌పే వంటి మాధ్యమాల ద్వారా డబ్బును కాజేస్తున్నారని హెచ్చరించారు. మొబైల్ పోగొట్టుకున్న లేదా చోరీకి గురైన వెంటనే సి.ఈ.ఐ.ఆర్ పోర్టల్‌లో ఫోన్‌ను బ్లాక్ చేయాలని, సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. సి.ఈ.ఐ.ఆర్ సేవలను వినియోగించడం ద్వారా పోగొట్టుకున్న మొబైల్‌ను తిరిగి పొందే అవకాశంతో పాటు, వ్యక్తిగత సమాచారం మరియు ఆర్థిక నష్టం జరగకుండా కాపాడుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. రికవరీ ఆపరేషన్‌లో కీలక పాత్ర పోషించిన ఇన్స్పెక్టర్ జాన్ రెడ్డి, సిబ్బంది అభినవ్, సాయి ల కృషిని ఏసీపీ ఈ సందర్భంగా అభినందించారు.

# కరీంనగర్‌లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు

**కరీంనగర్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో ప్రజల రక్షణ, శాంతిభద్రతలు, మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కరీంనగర్ పోలీసులు భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేశారు. నగరంలోని 14 ప్రధానచోట్ల నాఖాబంధీ నిర్వహించి, 6 ప్రాంతాల్లో ఔటర్ కార్డన్, 8 ప్రాంతాల్లో ఇన్నర్ కార్డన్ ఏర్పాటు చేసి విస్తృత స్థాయిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో డ్రంకెన్ డ్రైవ్ కేసులు 34, చలాన్స్ విధించబడిన వాహనాలు 74, సరైన ధ్రువపత్రాలు లేని 38 వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. నేడు సాయంత్రం అల్గునూర్ చౌరస్తా, బైపాస్, బొమ్మకల్ చౌరస్తా, రైల్వే స్టేషన్, రేకుర్తి చౌరస్తా, పద్మనగర్ బైపాస్‌తో పాటు గీతాభవన్ చౌరస్తా, మంచిర్యాల



చౌరస్తా, భగత్‌నగర్, నాఖా చౌరస్తా వంటి కీలక కూడళ్లలో ఏకకాలంలో పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. వాహనాలను ఆపి పత్రాలు, గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాలను అరికట్టడానికి, అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువుల కదలికలను గుర్తించడానికి ఈ తనిఖీలు ఎంతగానో ఉపయోగపడతాయని ఏసీపీ వెంకటస్వామి తెలిపారు. వాహనదారులు, ప్రజలు ఈ భద్రతా చర్యలకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 8712670744కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ట్రాఫిక్ ఏసీపీ యాదగిరిస్వామి, రూరల్ ఏసీపీ విజయకుమార్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అల్ఫోర్స్ హైస్కూల్ (సీబీఎస్ఈ) లో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



**వర్ధన్నపేట, నవంబర్ 13(నీలగిరి ఎక్స్ ప్రెస్)** విద్యార్థులకు పరిపాలన పట్ల అవగాహన కల్పించడం తో పాటు పరిపాలన యొక్క ప్రభావాలను తెలియపరిచినట్లయితే వారు పలు కార్యకలాపాలను చక్కగా అమలు పరచగలుగుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. గురువారం అల్ఫోర్స్ హైస్కూల్ (సీబీఎస్ఈ) లో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు నాయకత్వపు లక్షణాలను తెలియపరచాలని మరియు నాయకత్వపు లక్షణాల యొక్క విశిష్టతను తెలియపరచినట్లయితే వాటిని పెంపొందించుకుంటారని, పలు కార్యక్రమాలలో పై చేయి సాధించడమే కాకుండా విజేతలుగా ఉంటారని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి తప్పనిసరిగా తరగతి గదిలోని విషయాలను నేర్చుకోవడమే కాకుండా సమాజం పట్ల విస్తృతంగా అవగాహనను పెంపొందించుకొని ముందంజలో నిలవాలని సూచించారు. బాలల దినోత్సవం విద్యార్థులకు గొప్ప పండుగని, ఈ పండుగ సాంప్రదాయంగా వస్తున్నటువంటి స్వయం పరిపాలన దినోత్సవాన్ని వేడుకగా..ఉత్సాహంగా నిర్వహించుకోవడం చాలా గొప్ప విషయమని అన్నారు. విద్యార్థులు చక్కటి విషయాలను వారి మిత్రులతో పంచుకోవడం ఆనందాన్ని కలిగించిందని వారు చెప్పారు. వేడుకల సందర్భంగా విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు చక్కటి సందేశాన్ని ఇవ్వడమే కాకుండా ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు

**హుస్నాబాద్,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో బాలల హక్కుల ప్రజా వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వలస సుభాష్ చంద్రబోస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నేడు బాలల దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డుల ప్రధాన కార్యక్రమాన్ని హైదరాబాద్ మినీ రవీంద్రభారతి హాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు.



ఈ కార్యక్రమాన్ని తన తండ్రి కీర్తిశేషులు వలస శంకరయ్య జ్ఞాపకార్థం నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. చిన్నారి విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకను ఘనంగా ప్రారంభిస్తున్నామని, ప్రముఖులు హాజరై పిల్లలకు ప్రోత్సాహం అందజేస్తారని ఆయన వివరించారు. బాలబాలికలలో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు, వారిలోని నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ అవార్డులు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. దేశభక్తి పాటలు, భరతనాట్యం, గిటార్, కీబోర్డు వాయిద్యం, ఫ్లూట్, యోగా, చిత్రలేఖనం, కార్టూన్స్, కవిత్వం, జానపద నృత్యం, జానపద పాటలు, మిమిక్రీ, మ్యాజిక్, సైకిలింగ్, వాలీబాల్, కబడ్డీ, కోకో, బ్యాడ్మింటన్, చెస్, ఫుట్‌బాల్, పరుగులు, జాతీయ సమైక్యత శిబిరం, కరాటే, కూచిపూడి, కోలాటం, తబలా, బతుకమ్మ, స్విమ్మింగ్, బాస్కెట్బాల్, స్కేటింగ్, టెన్నిస్, అర్చరీ వంటి విభిన్న రంగాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రాష్ట్రస్థాయి బాలమిత్ర అవార్డులు అందజేయనున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సంఘ సేవకులు, బాలల హక్కుల కోసం పనిచేసే వ్యక్తులు, ప్రజా వేదిక రాష్ట్ర కమిటీ నాయకులు పాల్గొననున్నారని వలస సుభాష్ చంద్రబోస్ వెల్లడించారు.

# సింగరేణి వైద్య సిబ్బంది సమస్యల పరిష్కారానికి ఏఐటియుసి కృషి

**గోదావరిఖని,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సింగరేణి వ్యాప్తంగా ఏరియా హాస్పిటల్స్‌లో పని చేస్తున్న వైద్య సిబ్బంది సమస్యలను పరిష్కరించేందుకు ఏఐటియుసి కృషి చేస్తుందని, ఏ వన్ గ్రేడ్‌లో పని చేస్తున్న 86 మంది ఉద్యోగులకు ఎగ్జిక్యూటివ్‌గా ఈవన్ గ్రేడ్ ప్రమోషన్లు ఇవ్వడానికి యాజమాన్యం అంగీకరించిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. గురువారం గోదావరిఖని సింగరేణి ఏరియా హాస్పిటల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గుర్తింపు సంఘంగా ఏఐటియుసి గెలిచిన తరువాత గత ఆరేడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను ఒక్కటొక్కటిగా స్ట్రక్చర్ సమావేశాల్లో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం



చేస్తోందని వివరించారు. మైనింగ్ స్టాఫ్, ట్రేడ్స్‌మెన్స్, సూపర్‌వైజర్లు అండర్‌గ్రౌండ్‌లో మెడికల్ అన్‌ఫిట్ అయిన వారికి గత గుర్తింపు సంఘం హయాంలో సూటబుల్ జాబ్ ఇవ్వకుండా సర్ఫేస్ జనరల్ మజ్దూర్‌గా ఇచ్చారని, ఏఐటియుసి వీరందరికీ సూటబుల్ జాబ్ ఇవ్వాలని డిమాండ్ చేయడంతో యాజమాన్యం అంగీకరించి సర్ఫేస్‌లో కూడా అదే పనిని కొనసాగించేలా ఆదేశాలు జారీ చేసిందని ఆయన పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం ఏఐటియుసి నిరంతరం కృషి చేస్తోందని, అయితే కొన్ని కార్మిక సంఘాలు తప్పుదోవ పట్టిస్తూ విమర్శలు చేయడమే పని చేసుకుంటున్నాయని, అటువంటి వారి మాటలు నమ్మి మోసపోవద్దని కార్మికులకు సూచించారు. సింగరేణి వ్యాప్తంగా ఏరియా హాస్పిటల్స్‌లో పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు మాదన మహేష్, రంగు శ్రీను, దాసరి అనిల్, వేముల అశోక్, విజయలక్ష్మి, సంతోష్, దాసరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సమగ్ర మార్పులు

## అధ్యాపకులే వెన్నుముక

**హుస్నాబాద్ నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అధ్యాపకుల చిత్తశుద్ధి, కృషితోనే ఇంటర్ కళాశాలల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లా ఇంటర్ విద్యాధికారి శ్రీ కె. రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రభుత్వం సమగ్ర సాంకేతిక మార్పులకు శ్రీకారం చుట్టిందని, ముఖ్యంగా ముఖ ఆధారిత హాజరు విధానం, అధ్యాపకుల ముఖ ఆధారిత హాజరు, ప్రతి శనివారం హెల్ప్ ప్రోగ్రామ్‌లు, క్రీడా కార్యక్రమాలు, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక



శ్రద్ధ వంటి చర్యలు రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్నాయని ఆయన వివరించారు. కళాశాలల అభివృద్ధి కోసం ఇటీవలే ప్రభుత్వం 60 కోట్ల రూపాయలను మంజూరు చేసి, ప్రతి తరగతి గదిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, హైదరాబాదులోని కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా రాష్ట్రంలోని 430 కళాశాలలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం విజయవంతం కావడానికి అధ్యాపకులే వెన్నుముకలని, వారు చిత్తశుద్ధితో పనిచేస్తే ఫలితం తప్పకుండా ఉంటుందని ఆయన అన్నారు. పర్యవేక్షణలో భాగంగా హుస్నాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను సందర్శించిన రవీందర్ రెడ్డి, ఇరు కళాశాలల ప్రిన్సిపాళ్లు గంగాధర్, వి. లలితతో పాటు అధ్యాపకులు, సిబ్బందిని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపడం లక్ష్యంగా పనిచేద్దామని ప్రతిజ్ఞ చేశారు.

# ఘనంగా వందేమాతరం 150వ వార్షికోత్సవ వేడుకలు

**హుజురాబాద్,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వాతంత్ర ఉద్యమంలో కోట్లాది భారతీయుల్లో దేశభక్తి, స్ఫూర్తి నింపిన వందేమాతరం గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఏడాది పొడవునా కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో బిజెపి కరీంనగర్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వందేమాతరం గేయాలాపన కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. హుజురాబాద్ పట్టణ శాఖ అధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో వందేమాతరం గేయాలాపన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ, నవంబర్ 7, 1875న బంకిమ్‌చంద్ర చటర్జీ రచించిన వందేమాతరం గేయం స్వాతంత్ర సమరయోధుల రణనినాదంగా మారి భారతీయుల్లో చైతన్యాన్ని, స్ఫూర్తిని, దేశభక్తిని రగిల్చిందని అన్నారు. అలాంటి గొప్ప గేయం దేశ జాతీయ గేయంగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. 150వ వార్షికోత్సవ వేడుకలను బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగిస్తున్నామని, నవంబర్ 26 వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో వందేమాతరం గేయాలాపన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న



వందేమాతరం కార్యక్రమాలలో బిజెపి సైతం పాలుపంచుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ, మండల అధ్యక్షులు తూర్పాటి రాజు, రాముల కుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రావుల వేణు, జిల్లా కార్యదర్శి బింగి కరుణాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్, తూముల శ్రీనివాస్, మాజీ పట్టణ అధ్యక్షుడు గంగిశెట్టి రాజు, సీనియర్ నాయకులు రాజిరెడ్డి, తిప్పబత్తిని రాజు, యాంసాని శశిధర్, అంకతి వాసు, కొలిపాక శ్రీనివాస్, నల్ల సుమన్, పోతుల సంజీవ్, గంట సంపత్, వోడ్నాల చంద్రిక, మోతె తిరుపతి, అడ్వకేట్ భూమిరెడ్డి అమరేందర్ రెడ్డి, గూడూరు సత్యనారాయణ రెడ్డి, రవీందర్ రెడ్డి, నాంపల్లి సుమన్, పుల్లూరి శ్రీకాంత్, మోడేపు వినయ్, పారుపల్లి కొండల్ రెడ్డి, మునిగంటి నాగరాజు, రాజేష్ కన్నా, దేవేంద్ర, పల్లె వీరయ్య, భాస్కర్ యాదవ్, మర్రి రవీందర్, ముప్పు మహేష్, ప్రవీణ్ రెడ్డి, చైతన్య రెడ్డి, పున్నం చందర్, పవన్, కొడిమ్యాల కొలిపాక వెంకటేష్, ఆవుల సదయ్య, బోరగాల అజయ్, పంజాల లక్ష్మి, మండల సాయిబాబా, నాగరాజు, సబ్బని తిరుపతి, గుర్రం సంతోష్, సాల్ మోహన్, గొట్టే రవి, తూర్పాటి రాజశేఖర్, యాళ్ల రాజిరెడ్డి, ఉమాశంకర్, విజయ్, పర్థం, అనిల్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, యువత, వివిధ సంఘ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ఉగ్రకుట్రకు అడ్డాగా 17వ నంబర్ భవనం.. పథక రచన మొత్తం ఆ గది నుంచే..!

**న్యూఢిల్లీ – నవంబర్ 13.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** ఢిల్లీ బాంబు పేలుడు ఘటన నేపథ్యంలో అల్ ఫలాహ్ వర్సిటీ పేరు తెరపైకి వచ్చింది. ఈ వర్సిటీలో పనిచేస్తున్న డాక్టర్లు, ప్రొఫెసర్లు ఉగ్ర కుట్రలో భాగం కావడంతో దర్యాప్తు సంస్థల దృష్టి ఈ వర్సిటీపై పడింది. దర్యాప్తు అధికారులు వర్సిటీకి చేరుకొని ముమ్మరంగా సోదాలు చేస్తున్నారు. ఈ దర్యాప్తులో కీలక ఆధారాలు బయటపడ్డట్లు తెలుస్తోంది. మెడికల్ కాలేజీలోని బాయ్స్ హాస్టల్ ఉండే 17వ నంబర్ భవనం వీరి ఉగ్ర కార్యకలాపాలకు అడ్డాగా ఉన్నట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. ఈ భవనంలోని 13వ నంబర్ గది కీలకంగా మారింది. ముజమ్మిల్‌కి చెందిన ఈ గది వైట్ కాలర్ టెర్రర్ మాడ్యూల్ కు రహస్య సమావేశ కేంద్రంగా పనిచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఢిల్లీ, సమీప రాష్ట్రాల్లో పేలుళ్లకు ఈ గది నుంచే కుట్ర చేసినట్లు తేలింది.




యూనివర్సిటీ ల్యాబ్ నుంచి కొన్ని రసాయనాలను తీసుకురావాలని ఉమర్, ముజమ్మిల్ ప్లాన్ వేసినట్లుగా సమాచారం. ఈ గదిలో సోదాలు చేపట్టిన దర్యాప్తు అధికారులు కొన్ని కెమికల్స్‌తోపాటూ పెన్‌డ్రైవ్‌లు, పలు వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ముజమ్మిల్ గదితో పాటు ఉమర్‌కు చెందిన 4వ నంబరు గది నుంచి మూడు డైరీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందులో కీలక విషయాలు ఉన్నట్లు దర్యాప్తు వర్గాలు తెలిపాయి. డైరీల్లో భారీ ఉగ్ర ప్లాన్లను గుర్తించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. మొత్తం 32 వాహనాల్లో పేలుడు పదార్థాలను నింపాలని అనుమానిత ఉగ్రవాదులు ప్లాన్ చేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు పేర్కొన్నారు. మొత్తం 8 మంది అనుమానితులు సుమారు నాలుగు లొకేషన్లలో పేలుడుకు పాల్పడాలని భావించినట్లు తెలుస్తున్నది. పేలుడు పదార్థాలను కొనుగోలు చేసేందుకు వైట్‌కాలర్ డాక్టర్లు సుమారు 26 లక్షల నిధి సేకరించినట్లు తెలుస్తున్నది. అనుమానితులు డాక్టర్ ముజమ్మిల్ గన్నై, డాక్టర్ అదీల్ అహ్మద్ రాథర్, డాక్టర్ షహీన్ సయ్యీద్, డాక్టర్ ఉమర్ నబీ ఆ డబ్బును పోగు చేశారు. అయితే ఆపరేషన్స్ నిర్వహించేందుకు ఆ డబ్బును డాక్టర్ ఉమర్ వాడినట్లు తెలుస్తున్నది

# భారత్, చైనాలపై అమెరికా ఆంక్షలు



**వాషింగ్టన్: నవంబర్ 13.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమానికి సంబంధాలున్నందుకు భారతదేశం, చైనాతో సహా అనేక దేశాలకు చెందిన 32 సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు ప్రకటించింది. ఇరాన్ క్షిపణులు, ఇతర అసమాన, సాంప్రదాయ ఆయుధాల దూకుడు అభివృద్ధిని ఎదుర్కోవడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేపట్టిన చర్యల్లో భాగంగా ఈ ఆంక్షలున్నాయని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి, మానవరహిత వైమానిక వాహనం (యుఎవి) ఉత్పత్తికి సహకరించే ఇచ్చే ఇరాన్, చైనా, హాంకాంగ్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, టర్కియే, భారతదేశం మరియు ఇతర అధికార పరిధిలోని 32 సంస్థలు, వ్యక్తులపై అమెరికా ఆంక్షలు విధిస్తోందని అమెరికా విదేశాంగ శాఖ తెలిపింది. అమెరికా ట్రెజరీ అండర్ సెక్రటరీ జాన్ కె.హర్లీ మాట్లాడుతూ, ఇరాన్ ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలను దోపిడీ చేసి నిధులను అక్రమంగా మార్చుకుంటుందని, ఆ దేశ అణ్వాయుధ, సాంప్రదాయ ఆయుధ కార్యక్రమాలకు అవసరమైన భాగాలను సేకరిస్తుందని ఆరోపించారు. అధ్యక్షుడు ట్రంప్ ఆదేశాల మేరకు ఇరాన్ తన అణు ముప్పును అంతం చేయడానికి తాము ఒత్తిడి తెస్తున్నామని ఆయన అన్నారు.

# మాస్కులు కూడా సరిపోవు..

**- ఢిల్లీలో వాయు కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన**



**న్యూఢిల్లీ నవంబర్ 13.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయిలో ఉంది. రాజధాని ప్రాంతంలో గాలి నాణ్యత రోజురోజుకూ క్షీణిస్తోంది. గత కొన్ని రోజులుగా గాలి నాణ్యత సూచిక 400కిపైనే నమోదవుతోంది. దీంతో రాజధాని వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రతపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో వాయు కాలుష్య పరిస్థితిని చాలా తీవ్రమైనదిగా అభివర్ణించింది. వాయు కాలుష్య తీవ్రతకు మాస్కులు కూడా సరిపోవని వ్యాఖ్యానించింది. ఈ మేరకు సీనియర్ న్యాయవాదులను వర్చువల్‌గా విచారణకు హాజరుకావాలని సూచించింది. వర్చువల్‌గా హాజరయ్యే వెసులుబాటు ఉన్నప్పటికీ మీరు ఎందుకు భౌతికంగా కోర్టు కార్యకలాపాలకు హాజరవుతున్నారని సీనియర్ న్యాయవాదులను జస్టిస్ పీఎస్ నరసింహ ప్రశ్నించారు. 'మీకు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యే సౌకర్యం ఉంది. అయినా ఎందుకు వస్తున్నారు..? దాన్ని సద్వినియోగం చేసుకోండి. కాలుష్యం తీవ్ర నష్టాన్ని కలిగిస్తుంది' అని అన్నారు. ఈ విషయంపై ప్రధాన న్యాయమూర్తితో చర్చిస్తామని జస్టిస్ పీఎస్ నరసింహ తెలిపారు.

# వరంగల్ బస్టాండ్ పరిస్థితిపై బీజేపీ వినూత్న నిరసన



**వరంగల్,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని బస్టాండ్ పట్టించుకోకపోవడంతో అది పెద్ద స్విమ్మింగ్ పూల్‌గా మారిందని ఆరోపిస్తూ బీజేపీ నాయకులు వినూత్న నిరసన చేపట్టారు. వరంగల్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ బోట్స్ తెప్పించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక మంత్రి కొండా సురేఖ, మాజీ ముఖ్యమంత్రి కె.సి.ఆర్.లకు ఉచితంగా వరంగల్‌లో బోటింగ్ నిర్వహించడం ద్వారా వ్యంగ్యంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ, "వరంగల్ బస్టాండ్‌కి బస్సులు కాకుండా పడవలు తిరిగే పరిస్థితి తెచ్చిన మంత్రి కొండా సురేఖకు అభినందనలు. మంత్రిగా ఉండి తూర్పు ప్రజలకు మీరు చేసింది ఏమిటో చెప్పండి" అని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, వన్నాల శ్రీరాములు, రాష్ట్ర నాయకులు కంభంపాటి పుల్లారావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, జలగం రంజిత్ రావు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, జిల్లా, మండల పదాధికారులు, వివిధ మోర్చా అధ్యక్షులు, మహిళా మోర్చా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వివాహ వేడుకలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి



**పెద్దపల్లి నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి పట్టణంలోని పెద్దమ్మ నగర్‌కు చెందిన గజ్జెల రామచంద్రం కుమారుడు వివాహ వేడుకలో మాజీ శాసనసభ్యులు దాసరి మనోహర్ రెడ్డి పాల్గొన్నారు. నూతన దంపతులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నూతన దంపతుల దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండిపోవాలని ఆకాంక్షించారు.

# ఏసీబీ వలలో టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్

**రంగారెడ్డి,నవంబర్ 13 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రంగారెడ్డి జిల్లా ఆదిబాట్ల మున్సిపాలిటీలో అవినీతి వ్యతిరేక శాఖ (ఏసీబీ) అధికారులు ఈ రోజు సడెన్ రైడింగ్ నిర్వహించి అవినీతి బయటపెట్టారు. టౌన్



ప్లానింగ్ ఆఫీసర్ వరప్రసాద్, అసిస్టెంట్ వంశీ ఇల్లు పర్మిషన్ విషయంలో ఆనంద్ అనే వ్యక్తి నుండి రూ.75,000 లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు మున్సిపల్ ఆఫీస్‌లో దాడి చేసి సాక్ష్యాధారాలతో ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనతో ఆదిబాట్ల మున్సిపాలిటీలో కలకలం రేగింది. మరింత విచారణ కొనసాగుతోందని ఏసీబీ అధికారులు తెలిపారు.

# పత్తి కూలీల ఆటో బోల్తా

**దేవరకొండ నవంబర్ 13.(నీలగిరి ఎక్స్ ప్రెస్).** నల్లగొండ జిల్లా నేరేడుగొమ్మ మండలం పరిధిలో గల బుగ్గతండా వద్ద గురువారం వారం నాడు అదుపు తప్పి కూలీల ఆటో బోల్తా పడిన ఘటనలో పదిమంది కూలీల కు గాయాలయ్యాయి,ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది , క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పత్తి కూలీల ఆటో పీఏ పల్లి మండలం పెద్ద గుమ్మడం గ్రామస్తులు పత్తి తీసేందుకు



కాచురాజుపల్లి వెళుతుండగా బుగ్గ తండా వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటన సమయంలో ఆటోలో 18మంది కూలీలు ప్రయాణిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.